క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : బేటీ బచావో- బేటీ పడావో పథకం అమలులో భాగంగా శానిటరీ న్యాప్‌కిన్స్ వెండింగ్ మిషన్లు(విత్ ప్యాడ్స్) 13 మండలాల పరిధి 13 జెడ్పీహెచ్ఎస్‌లకు, శానిటరీ న్యాప్‌కిన్స్ డిస్పోజల్ మిషన్స్ 10 కేజీబీవీలకు, 10 కేజీబీవీలకు కంప్యూటర్లు సరఫరా చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాచర్ల శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 21లోపు హనుమకొండలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు రైల్వే పెన్షనర్ల సమావేశం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సంగమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశానికి రైల్వే ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో సమావేశాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు.

మాల మహానాడు రాష్ట్ర కమిటీ రద్దు

హన్మకొండ: తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు మహానాడు జాతీయ అధ్యక్షుడు గొల్ల అరుణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాలల హక్కుల సాధనకు పనిచేసే వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పూర్వ కమిటీ బాధ్యులు సహకరించాలని కోరారు.

పూజిత అక్షింతలకు స్వాగతం



కాజీపేట: శ్రీరామ జన్మభూమి అయోధ్య తీర్థక్షేత్రం శ్రీరాంలీల మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ జరిపిన పూజిత అక్షింతలు కాజీపేట పట్టణానికి శనివారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా అక్షింతలకు విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పెసరు తిలక్, చాడ శ్రీనివాస్ రెడ్డి, దీపక్ కొల్హారియ, రావుల కిషన్, శ్రీరామ ఉదయ్‌కుమార్, ప్రసాద్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బ్రాహ్మణ సేవా సమితి నాయకులు



హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, సమితి రాష్ట్ర కార్యదర్శి జీవీఎస్ శ్రీనివాసాచారి కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన సీతంపేటకు చెందిన గోపరాజు చంద్రయ్య కుటుంబాన్ని హెప్సిబా మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గిన్నారపు సదానందం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సద్దునూరి చేరాలు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంపాల యుగంధర్, నాయకులు బాబు, రాజయ్య, రవి, చిన్న బాబు, కుమార్, సాంబయ్య, కనకయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఆలయంలో జరగనున్న అయ్యప్ప మాలధారుల అన్నదాన వాల్‌పోస్టర్లను మంత్రితో కలిసి ఆవిష్కరించారు. మంత్రిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు యేలిశాల ఆనంద్‌కుమార్, దాసరి రాజేష్, కూచన రవీందర్, పాలకోజు కరుణాకర్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావును కలిసిన ప్రభాకర్

ఖిలా వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును హైదరాబాద్‌లోని మంత్రి కొండా సురేఖ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు, చిరంజీవి అభిమాన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యాడ (కరాటే) ప్రభాకర్ గౌడ్, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళికి పుష్పగుచ్ఛం అందజేశారు.

తెరుచుకోని గ్రంథాలయం



మడికొండలోని గ్రంథాలయ భవనం



చిందరవందరగా ఉన్న వార్త పేపర్లు, పుస్తకాలు



కూలిపోయిన గ్రంథాలయం గోడ

- మడికొండలో శిథిలావస్థకు చేరిన భవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు, విద్యార్థులు

మడికొండ: రెండేళ్లుగా మడికొండలోని గ్రంథాలయం తెరుచుకోవడం లేదు. 30ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రంథాలయం గతంలో పాఠకులు, విద్యార్థులతో కళకళలాడేది. నేడు దాన్ని తెరిచేవారు లేక, పాఠకులు లేక వెలవెలబోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం

గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. గోడలు సైతం కూలిపోయి అధ్వానంగా తయారైంది. విద్యుత్ సరఫరా లేదు. అందులోని పుస్తకాలు, పాత పేపర్లు వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన లైబ్రేరియన్‌ను మరోచోటుకు బదిలీ చేశారు. ఇంకో లైబ్రేరియన్‌ను కేటాయించకపోవడంతో గ్రంథాలయాన్ని తెరిసే నాథుడే లేదు. ఇన్‌చార్జ్ ఉన్నా అతడు పట్టించుకోవడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి మడికొండలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



మడికొండలో గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. భవన నిర్మాణ విషయమై అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. పాఠకుల కోసం దిన పత్రికలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలి.

\- పొనగోటి వెంకట్‌రావు, బీజేపీ నాయకుడు

పుస్తకాలను అందుబాటులో ఉంచాలి



పోటీ పరీక్షలకు సిద్ధపడే అభ్యర్థులకు అన్ని రకాల పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం నియామకాలు చేపట్టనున్న క్రమంలో స్థానికంగా సదుపాయాలు కల్పించాలి. జిల్లా గ్రంథాలయానికి వెళ్లి చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్థానికంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి.

\- దార ధనుంజయ్, విద్యార్థి

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి



సర్టిఫికెట్లు అందుకున్న శిక్షణ పొందిన విద్యార్థినులు

విద్యారణ్యపురి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి సూచించారు. ఆరు రోజులుగా కళాశాలలో నాంది మహేంద్ర ప్రైడ్ ఆధ్వర్యంలో ఎంప్లాయిబులిటీ స్కిల్స్‌పై డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు రెండు బ్యాచ్‌లుగా తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ నాలెడ్జ్ (టాస్క్) సహకారంతో శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ భవిష్యత్తులో ఉపయోగపడుతుందని చెప్పారు. మహేంద్ర ప్రైడ్ ట్రైనర్లు శివరంజన్ రెడ్డి, దశరథ్ రామ్‌రెడ్డి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఎస్.కవిత, మెంటార్ మహ్మద్ రఫీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ కల్పన, అరుణ, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం, శిక్షణ పొందిన వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే..



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

కరీమాబాద్: రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, తనకు పార్టీ ఎలాంటి అవకాశం ఇచ్చిన పనిచేస్తానని బీజేపీ జాతీయ నాయకుడు, పార్టీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ పొలసాని మురళీధర్‌రావు అన్నారు. నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన బీజేపీ గెట్ టు గెదర్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ గెలుపునకు కృషిచేసినందుకు మురళీధర్ రావును పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ పొలసాని మురళీధర్‌రావు వరంగల్ ముద్దుబిడ్డ అని, ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఏపని అయినా నిబద్ధతతో చేసి, పార్టీ విజయానికి కష్టపడిన మురళీధర్‌రావు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేయాలని కోరారు. ఆయనకు మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తే గెలుపునకు కృషిచేస్తామని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, వంగాల సమ్మిరెడ్డి, సముద్రాల పరమేశ్వర్, ఎడ్ల అశోక్‌రెడ్డి, కార్పొరేటర్ జలగం అనిత రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మిస్టరీగానే వృద్ధురాలి హత్య కేసు

కాజీపేట : శుక్రవారం తెల్లవారు జామున దారుణ హత్యకు గురైన వృద్ధురాలి కేసును చేధించడం పోలీసులకు సవాల్‌గా మారింది. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీకి చెందిన కన్నె విజయ (68)ను ఇంటి సమీపంలోనే కిడ్నాప్ చేసి హతమార్చడం సంచలనంగా మారింది. మృతురాలి ఇంటి పక్కనే మృతదేహాన్ని నగ్నంగా పడేయడం పట్టణంలో చర్చనీయంశంగా మారింది. కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ పర్యవేక్షణలో స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, ఐటీ కోర్ సిబ్బంది, క్లూస్ టీం, క్రైమ్ పోలీసులు రెండు రోజులుగా కాలనీలోనే మకాం వేసి కేసులో దాగిఉన్న మిస్టరీని చేధించి నిందితులను పట్టుకోవాలని శ్రమిస్తున్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించి నిందితుల ఆనవాళ్లను గుర్తించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

కాలనీవాసులపైనే అనుమానం..

ప్రధానంగా పోలీసుల దృష్టి రహమత్‌నగర్ కాలనీ వాసులపైనే కేంద్రీ కృతమైంది. వృద్ధురాలికి తెలిసిన వ్యక్తులే నమ్మించి ఇంట్లోకి పిలిచి నగలు దోచుకుని హతమార్చి ఉంటారనే కోణంలోను విచారణ వేగవంతం చేశారు. బంధుమిత్రులు కూడా పోలీసుల వద్ద ఇదే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించి అనుమానితుల కదలికలపై నిఘా వేసి కేసును చేధించే పనిలో నిమగ్నమయ్యారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణం తొలగింపు



అక్రమ నిర్మాణాన్ని తొలగించిన అధికారులు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీ రోడ్డుపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని బల్దియా అధికారులు తొలగించారు. అక్రమ నిర్మాణంతో కాలనీ రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహానగర పాలక సంస్థలో కాలనీ అధ్యక్షుడు ఎనుగంటి రాజు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బల్దియా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న అక్రమ నిర్మాణాన్ని శనివారం తొలగించారు. కార్యక్రమంలో సుధాకర్, రమేష్, కుమారస్వామి, రాధాకృష్ణ, తోట చందర్, చంద్రయ్య, జక్కన, అజయ్, శివ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష నామార్చన

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు శనివారం లక్ష్మీనారాయణుల లక్ష సహస్ర నామార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారితో పాటు శ్రీనివాసుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. పలువురు మహిళలు భక్తిగీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఉత్సవాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జలాధివాస పూజలు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని మడేలయ్య దేవాలయ ఆవరణలో నూతనంగా ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు అర్చకులు శనివారం జలాధివాసం నిర్వహించారు. అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గణపతి హోమం, సహస్ర కళాశాభిషేకం పూజలు జరిపించారు. మడేలయ్య, సీతాలమ్మ, ఈశ్వరమ్మ విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించనున్నట్లు పీ.శివకుమార్ తెలిపారు.

అదనపు కలెక్టర్‌గా రాధిక గుప్తా బాధ్యతల స్వీకరణ



అదనపు కలెక్టర్ రాధిక గుప్తాకు మొక్క అందజేస్తున్న మహేందర్ జీ

కాజీపేట: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా రాధిక గుప్తా శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, ఆర్డీఓ రమేష్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

ఎంజీఎం : హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో హన్మకొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అవార్డులు సాధించినట్లు హనుమకొండ డీఎంహెచ్ఓ సాంబశివరావు తెలిపారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాలతో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు. అవార్డులు సాధించిన గండి సహస్ర, నలిమెల అక్షయకు రూ.50 వేల నగదు బహుమతి, ట్రోఫీని న్యాకో అధికారి గౌతమ్, ఛత్తీస్‌గఢ్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జీజే.రావు చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు.

ప్రొఫెసర్ సమ్మయ్యకు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ ఫెల్లోషిప్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.సమ్మయ్యకు నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ ఫెల్లోషిప్ అవార్డు -2023 లభించింది. న్యూఢిల్లీలోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. ఇటీవల లక్నోలోని సీఎస్ఐఆర్ నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫెల్లోషిప్ అవార్డు అందుకున్నట్లు సమ్మయ్య శనివారం తెలిపారు.

22నుంచి డబ్బింగ్ శిక్షణ తరగతులు

నయీంనగర్: సినిమా, టీవీ రంగాలకు సంబంధించి వాయిస్ ఓవర్(డబ్బింగ్) శిక్షణ తరగతులు ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు హనుమకొండ ఆదర్శ లా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బాధ్యులు పూసపాటి వినోద్‌కుమార్ రాజు తెలిపారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాడ సునీల్, అంజన్‌కుమార్, చిర్ర రాజుగౌడ్, ఉమాదేవి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న సయ్యద్ అసద్

కాశిబుగ్గ: నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వరంగల్ జిల్లా వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సయ్యద్ అసద్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు మొదటగా రాజకీయ ప్రాధాన్యం కల్పించిన పార్టీ అని అన్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ నామినేటెడ్ పదవుల్లో మొదటి ప్రాధాన్యం వికలాంగులకు కల్పించి వారిని ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఉప్పలయ్య, శ్రీనివాస్, నల్లెల రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెసెక్టమీ శస్త్రచికిత్స పక్షోత్సవాలు



వెసెక్టమీ చేసుకున్న వారితో యాకూబ్‌పాషా

నయీంనగర్: వెసెక్టమీ అవగాహన, శస్త్రచికిత్సల పక్షోత్సవాలను ఈనెల 11నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. పక్షోత్సవాల్లో భాగంగా హనుమకొండ పోచమ్మకుంట యూపీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన వెసెక్టమీ శస్త్రచికిత్స శిబిరంలో 16మంది శస్త్ర చికిత్సలు చేయించుకున్నందుకు వారిని సాంబశివరావు అభినందించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఎన్ఎస్‌వీ సర్జన్ డాక్టర్ ఎండీ.యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో పురుషుల కోసం ఎన్ఎస్‌వీ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, మాస్ మీడియా అధికారి వీ.అశోక్‌రెడ్డి, ఎస్ఓ ప్రసన్నకుమార్, సీహెచ్ఓ మాధవరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



భానును సన్మానిస్తున్న యోగా గురువులు

హన్మకొండ: జాతీయ స్థాయి యోగా పోటీలకు వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన భాను ఎంపికయ్యారని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. చేర్యాల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భాను.. ఇటీవల నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో భాను పాల్గొననున్నట్లు తెలిపారు. ఈమేరకు భానును యోగా గురువులు పోశాల శ్రీనివాస్, సునీత సన్మానించారు.

కోటలో పర్యాటకుల సందడి



మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో విద్యార్థులు

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ కోటను తిలకించేందుకు పలు పాఠశాల విద్యార్థులు, పర్యాటకులు శనివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో శిల్పాల ప్రాంగణంతోపాటు కోట పరిసరాలు జనంతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా నాలుగు కీర్తితోరణాల నడుమ ఉన్న అద్భుతమైన శిల్పకళా సంపద, ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలను వారు తిలకించారు. నల్లరాతిలో చెక్కిన శిల్ప సంపద.. పర్యాటకులకు కనువిందు చేసింది. శిల్పాలను కాకతీయుల విశిష్టతను విద్యార్థులకు కోట గైడ్ రవియాదవ్ వివరించారు. కార్యక్రమంలో టీఎస్‌టీడీసీ ఇన్‌చార్జ్ అజయ్, కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

26న ఎర్రజెండాలు ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేసి సంబురాలు ఘనంగా జరుపుకోవాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. హనుమకొండ వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు కే.భిక్షపతి, ఎల్లేశ్, శ్రీనివాస్, సదాలక్ష్మి, రాములు, లక్ష్మణ్, ఓదేలు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'



సదస్సులో మాట్లాడుతున్న వినీల

కాజీపేట: వేధింపులకు గురయ్యే బాధిత బాలికలు, మహిళలు సఖి కేంద్రం అందించే ఉచిత సేవలను వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ వినీల సూచించారు. కాజీపేట పట్టణంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం 0870 - 2452112 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, హరిత తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

వరంగల్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున సద్దుల బతుకమ్మ చీరల పంపిణీ అర్ధంతరంగా నిలిపివేశారని, ఎన్నికలు ముగిసిన క్రమంలో మహిళలకు తిరిగి పంపిణీ చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం 40శాతం మందికి మాత్రమే చీరలు అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎన్నికల కోడ్ వల్ల అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. స్మార్ట్‌సిటీ, ఇతర అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీకి శుభాకాంక్షలు



రిజ్వీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎస్ ఈఈయూ -327 నాయకులు

హన్మకొండ: టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఏఎం.రిజ్వీని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ) -327 నాయకులు కలిశారు. జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన రిజ్వీని హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో టీఎస్ఈఈయూ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, ట్రాన్స్‌కో విభాగం కార్యదర్శి రమేష్, జెన్‌కో విభాగం అధ్యక్షుడు పీ.మాధవ్‌రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు సాదం రామకృష్ణ, రాజ్‌కుమార్, సాంబమూర్తి, కరుణాకర్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.